జగనన్న కాలనీల్లో జోరుగా నిర్మాణాలు

- నిర్మాణాల్ని వేగవంతం చేసే ప్రయత్నాల్లో అధికారులు
- ఉగాది నాటికి సామూహిక గృహప్రవేశాలకు ఏర్పాట్లు



అనపర్తి శివారు కొత్తూరులో వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న గృహాలు

అనపర్తి: సొంతిల్లు.. ప్రతి ఒక్కరికీ ఓ అందమైన కల.. పేద, మధ్య తరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసే ధ్యేయంతో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుంది. నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్లు పథకానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశ చరిత్రలోనే తొలిసారిగా లక్షలాది మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో పాటు ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన వనరులు సమకూర్చుతూ తోడ్పాటును అందిస్తున్నారు. దీంతో వైఎస్సార్ జగనన్న కాలనీల రూపంలో కొత్త గ్రామాలు రూపుదిద్దుకుంటున్నాయి. ఉగాది నాటికి జగనన్న కాలనీల్లో గతంలో గృహప్రవేశాలు చేసినవి కాకుండా అదనంగా మరికొంత మంది లబ్ధిదారులు గృహప్రవేశాలు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అధికార యంత్రాంగం పనిచేస్తోంది.

వివిధ దశల్లో 5,963 ఇళ్ల నిర్మాణాలు

పేదలకు స్థలాలు మంజూరు చేయడంతో పాటు ఇళ్లు నిర్మించుకునే స్తోమత లేని వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. దీంతో గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. అనపర్తి నియోజకవర్గ పరిధిలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల పరిధిలో మొత్తం 70 లేఅవుట్‌ల్లో మొత్తం 12,638 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించింది. అలాగే సొంత స్థలాలున్న వారికి సైతం గృహాలు మంజూరు చేసింది. జగన్న లేఅవుట్‌ల్లో 5,963 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉండగా ఇప్పటివరకు 3,193 మంది లబ్ధిదారులు గృహ నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలు చేశారు. ఉగాది నాటికి అదనంగా మరో 1,551 గృహాలు పూర్తి చేసి గృహప్రవేశ పండగను నిర్వహించాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. దీనికి తగ్గట్టుగానే ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగమంతా ప్రయత్నాలు చేస్తోంది.

నియోజకవర్గంలో వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాల వివరాలు

మండలం	మంజూరైన ఇళ్లు	బీబీఎల్	బీఎల్	ఆర్ఎల్	ఆర్‌సీ	పూర్తయినవి
అనపర్తి	2,329	730	948	86	13	545
బిక్కవోలు	2,562	1,177	616	55	7	694
రంగంపేట	4,414	2,809	231	105	28	1,234
పెదపూడి	3,333	1,928	552	73	56	720

పేదల జీవితాల్లో వెలుగులు

ప్రభుత్వ సహకారంతో ఆశల సౌధాలు రూపుదిద్దుకోవడంతో పేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయి. ఇళ్ల నిర్మాణాలకు గాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఒక్కో గృహానికి రూ.1.80 లక్షలు కేటాయిస్తోంది. వివిధ దశల్లో నిర్మాణాలు పూర్తి చేసిన లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తోన్న ప్రభుత్వం లబ్ధిదారులకు అడుగడుగునా బాసటగా నిలుస్తోంది. దీంట్లో భాగంగా ప్రభుత్వం మంజూరు చేస్తున్న సొమ్ముకు అదనంగా డీఆర్‌డీఏ విభాగంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు మరో రూ.35 వేలు రుణంగా అందిస్తోంది. జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వం రోడ్లు, తాగునీరు, విద్యుత్, తదితర సౌకర్యాలు కల్పనకు చొరవ చూపుతోంది. నిర్మాణం చేపట్టిన వారికి ఇసుక, సిమెంట్, ఐరన్‌తో పాటు నిర్మాణానికి అవసరమైన వివిధ వస్తువులు ప్రభుత్వం అందిస్తోంది.

పారిశ్రామిక కేంద్రంగా ఆంధ్రప్రదేశ్

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై నమ్మకంతో పెట్టుబడులు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రానున్న రోజుల్లో పారిశ్రామిక కేంద్రంగా పురోగమించనుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. విశాఖపట్టణం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్(జీఐఎస్) సదస్సు విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి తన ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విశాఖలో నిర్వహించిన జీఐఎస్ సదస్సు యావత్ దేశం దృష్టిని ఆకర్షించిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనపై నమ్మకంతో జాతీయ, అంతర్జాతీయ దిగ్గజాలతో రాష్ట్రానికి రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు కుదిరాయన్నారు. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో జరిగిన ఏ పెట్టుబడుల సదస్సులకు హాజరుకాని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ చైర్మన్ ముఖేష్ అంబానీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న నమ్మకంతో విశాఖ జీఐఎస్ సదస్సుకు హాజరయ్యారని తెలిపారు. జీఐఎస్ సదస్సులో చేసుకున్న ఒప్పందాలతో వచ్చే పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో సుమారు 6 లక్షల మంది యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయని చెప్పారు. ఒకపక్క రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నా, ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రచార ఆర్భాటం ఎక్కువ, పని తక్కువ అని ఎద్దేవాచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, సర్పంచ్ వారా కుమారి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ కర్రి దాసు, పార్టీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్ఎస్, చేనేత విభాగం అధ్యక్షుడు పెనుగొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ మాజీ ఉపసర్పంచ్



టీడీపీ మాజీ ఉపసర్పంచ్ జెమ్మిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రంగంపేట: పెదరాయవరం గ్రామానికి చెందిన టీడీపీ మాజీ ఉప సర్పంచ్ సానిపిని వీర వెంకట సత్యనారాయణ(జెమ్మి) వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాచిన గోవిందరాజు, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్‌లు పార్టీ కండువా వేసి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీలోకి మరిన్ని చేరికలు ఉంటాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనితీరు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితుడినై పార్టీలో చేరినట్టు వీరవెంకట సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మద్దిపాటి వీర్రాజు, గారపాటి బాపన్న, పెండ్యాల కృపానందం తదితరులు పాల్గొన్నారు.

చైతన్యంతోనే మహిళా సాధికారత

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి




కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: మహిళలు విద్యావంతులు, చైతన్యవంతులైనపుడే సమాజంలో మహిళా సాధికారత సాధ్యపడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐటీసీ ఆధ్వర్యంలో స్థానిక తేతలి రామిరెడ్డి మంగాయమ్మ కళావేదిక ప్రాంగణంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మహిళా సాధికారత సాధించేందుకు, మహిళల సంక్షేమం, భద్రతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. దేశాభివృద్ధిలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారని, మారుతున్న కాలానుగుణంగా మహిళల ఆలోచనా దృక్పథంలో మార్పు రావాలన్నారు. మహిళలు తమకు ఎదురయ్యే సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొని, అన్ని రంగాల్లో ప్రావీణ్యం సంపాదించి నవ సమాజ నిర్మాణంలో మార్గదర్శకులుగా నిలవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

అటు వైద్యం.. ఇటు నాట్యం

- డాక్టర్ ఇందిర ప్రతిభ
- మహిళా దినోత్సవం సందర్భంగా కథనం



డాక్టర్ ఓగిరాల ఇందిర

మధురపూడి: డాక్టర్‌గా మహిళలకు ప్రసూతి సేవలందిస్తూ, కూచిపూడి నృత్యంతో అందరి మన్ననలు అందుకుంటున్నారు డాక్టర్ ఓగిరాల వెంకట ఇందిర. 61 సంవత్సరాల వయసులోనూ నృత్యం చేస్తున్నారు. కృష్ణాజిల్లాకు చెందిన ఓగిరాల వెంకట ఇందిర 1985లో ఎంబీబీఎస్, 1986లో హౌస్ సర్జిన్ పూర్తిచేశారు. అనంతరం 2011లో రాజానగరం జీఎస్ఎల్‌లో ఎండీ చేశారు. ప్రస్తుతం పశ్చిమగోదావరి జిల్లా తణుకు ప్రభుత్వాస్పటల్‌లో సివిల్ సర్జిన్ రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్ (సీఎస్ఆర్ఎంఓ)గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆమె కోరుకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యురాలిగా ఎక్కువకాలం సేవలు అందించడంతో ఈ ప్రాంతంతో అనుబంధం ఏర్పడింది. దీంతో కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల సందర్భంగా నాలుగేళ్లుగా కూచిపూడి నృత్య ప్రదర్శన ఇస్తున్నారు. నృత్యంలో ఆమె పలు అవార్డులు సాధించారు. రాజమహేంద్రవరానికి చెందిన మార్నెళ్ల లక్ష్మాజీరావుతో ఆమెకు 1979లో వివాహమైంది. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని, ఆర్థికంగా తమకాళ్లపై నిలబడాలని ఆమె అన్నారు.



కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాల్లో కూచిపూడి నృత్యం చేస్తున్న డాక్టర్ ఇందిర

ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం



సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



గంగరాజు దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

రాజానగరం: రాష్ట్రంలో ప్రజలందరూ ఆరోగ్యంతో ఆనందంగా ఉండాలనే సంకల్పంతో సీఎం జగన్ ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. సీఎం సహాయ నిధి ద్వారా 13 మందికి మంజూరైన రూ. 10.37 లక్షల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను మంగళవారం రాజమహేంద్రవరంలోని తన నివాసం వద్ద లబ్ధిదారులకు అందజేశారు. రాజానగరం మండలానికి చెందిన ఆరుగురికి రూ.6.58 లక్షలు, సీతానగరం మండలానికి చెందిన ముగ్గురికి రూ.1.47 లక్షలు, కోరుకొండకు చెందిన ఒకరికి రూ.1.30 లక్షల సహాయం మంజూరైంది. అందరికీ సంక్షేమ పథకాలు అందాలనే ఆశయంతోనే ఆరోగ్యశ్రీ పథకంలో అనేక మార్పులు చేసి, 2,446 రకాల వ్యాధులకు అందించే చికిత్సలను 3,254 రకాల వ్యాధులకు పెంచుతూ చర్యలు తీసుకున్నారన్నారు. పేదల కోసం అహర్నిశలు పాటుపడుతున్న సీఎం జగన్‌కు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కూడా పాల్గొన్నారు.

గంగరాజుకు అభినందనలు

కష్టపడి పనిచేస్తూ, పార్టీ అభివృద్ధికి కృషి చేసే వారికి సముచిత పదవులు లభిస్తాయని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమింతులైన మేడిబోయిన గంగరాజు మంగళవారం ఎమ్మెల్యేని కలుసుకుని దుశ్శావాతో కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గంగరాజును అభినందిస్తూ సీఎం జగన్ మీపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ పటిష్టతకు అంకితభావంతో పనిచేయాలని సూచిస్తూ, గంగరాజు దంపతులను ఎమ్మెల్యే సత్కరించారు.

ఎమ్మెల్యేకు పలు వినతులు

రాజానగరం: కానవరంలో ఆన్‌లైన్ నమోదు కాని పంట భూములను గుర్తించి, వాటికి కూడా నమోదు జరిగేలా చర్యలు తీసుకుంటామని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కానవరానికి చెందిన కొందరు రైతులు మంగళవారం ఎమ్మెల్యేని కలుసుకుని చేసిన విజ్ఞాపనలపై ఆయన పైవిధంగా హామీ ఇచ్చారు. అలాగే సీతానగరం మండలం రాపాకలో ఎస్సీపేటను ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో ఎస్సీ కమ్యూనిటీ హాలును నిర్మించి, అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేసి, పిల్లలు ఆడుకునే విధంగా పార్కును నెలకొల్పాలని ఆ పేటకు చెందిన యువకులు కొందరు ఎమ్మెల్యేను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలోనే మీ గ్రామంలో నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఇందుకు అవసరమైన నిధులు కేటాయించేలా కృషి చేస్తానన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

సీతానగరం: చినకొండేపూడిలోని సూర్యచంద్ర ఇంగ్లిషు మీడియం హైస్కూల్ కరస్పాండెంట్, సెక్రటరీ కె.ప్రసన్న రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్న రెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రసన్నరెడ్డి ఆధ్వర్యంలో జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, శ్రీరమా నర్సింగ్ హోం డాక్టర్ సీహెచ్ శశికళలను సత్కరించారు.

ఉపాధ్యాయినిలకు సత్కారం

బిక్కవోలు: మండలంలోని మెళ్లూరు ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయినిలు ఎస్.కామాక్షి, అలియా బేగంలను విద్యార్థులు మంగళవారం సత్కరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బీవీఎల్ఎస్‌మూర్తి ఆధ్వర్యంలో ఉపాధ్యాయినిలతో పాటు పాఠశాలలో పనిచేస్తున్న సిబ్బంది దుర్గ, భవానీ, సావిత్రిలను సన్మానించారు.

వెంకట రమణయ్య సేవలు చిరస్మరణీయం

రంగంపేట: అఖిల భారత గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య సేవలు చిరస్మరణీయమని గ్రంథాలయ అధికారి ఎస్.రామకోటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో వెంకటరమణయ్య 44వ వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామకోటేశ్వరరావు మాట్లాడుతూ అయ్యంకి గ్రంథాలయాలే విశ్వవిద్యాలయాలని చాటి చెప్పిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో పీవీ ప్రసాద్, కె.దుర్గాప్రసాద్, టి.శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈఎండీపీ రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

గోకవరం: మల్లవరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఎంట్రప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఈఎండీపీ) పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం ఎస్‌వీవీ సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు సైన్స్ ఉపాధ్యాయురాలు కె.ఝాన్సీ ఆధ్వర్యంలో తయారు చేసిన లో కాస్ట్ మంకీ స్కేరర్ డివైజ్ ప్రాజెక్టు ఈఎండీపీకి ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, వారికి గైడ్ చేసిన ఉపాధ్యాయిని ఝాన్సీని హెచ్ఎంతో పాటు ఎంఈఓ బి.గౌరమ్మ, గ్రామ పెద్దలు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో ఊంజల్ సేవ



మధురపూడి: కోరుకొండ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం ఊంజల్ సేవ ఘనంగా నిర్వహించారు. కూరగాయలు, పండ్లతో అలంకరించిన స్వామి వారి కల్యాణ మండపం ప్రత్యేకార్షణగా నిలిచింది. సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం రాత్రి 10 గంటలకు స్వామివారు శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాజమహేంద్రవరం జోనల్ ఇన్‌చార్జి జక్కంపూడి గణేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ధనదుర్గమ్మ జాతర మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో ధనదుర్గమ్మ

సీతానగరం: స్థానిక వెలమపేటలో కొలువైన ధనదుర్గమ్మ జాతర మహోత్సవాన్ని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం 5 గంటల నుంచి అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. సోమవారం రాత్రి గరగ నృత్యాలు, తీన్‌మార్, డప్పుల వాయిద్యాలు, వివిధ దేవతామూర్తుల వేషధారణలతో అమ్మవారిని ఊరేగించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ఎస్సై కె.శుభశేఖర్, సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఆలయ పురోహితుడు దత్తుడు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఉత్సవ కమిటీ పర్యవేక్షణలో మధ్యాహ్నం 11 గంటల నుంచి అన్నసమారాధన నిర్వహించారు.

సోమేశ్వరస్వామికి లక్షపత్రి పూజలు



పెదపూడిలో ప్రత్యేక అలంకరణలో సోమేశ్వరస్వామి, అమ్మవారు

పెదపూడి: పెదపూడిలో ప్రసిద్ధి చెందిన శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామికి మంగళవారం లక్షపత్రి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొమ్మనాపల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ఉదయం విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

తొస్సిపూడిలో రక్తపరీక్షలు

బిక్కవోలు: మండలంలోని తొస్సిపూడి గ్రామంలో జీఎస్ఆర్ యూత్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత రక్తపరీక్షల శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ కొవ్వూరి సీతారత్నం ప్రారంభించారు. 75 మందికి షుగర్ వ్యాధి పరీక్షలు నిర్వహించి 25 మందికి వ్యాధి ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో యువజన సంఘం గౌరవ అధ్యక్షుడు జీఎస్ఎన్‌రెడ్డి, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

సీతానగరం: మండలంలోని నాగంపల్లి, సీతానగరాల్లో 553 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశామని మండల పశువైద్యాధికారి డాక్టర్ ఆంధ్ర ఫణీంద్ర తెలిపారు. ఈనెలాఖరు వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

బిక్కవోలు ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం

బిక్కవోలు: బిక్కవోలు మండలం బలభద్రపురంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సలీమ్ ఆధ్వర్యంలో బిక్కవోలు ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. ప్రెస్‌క్లబ్‌కు గౌరవ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, అధ్యక్షుడిగా షేక్‌ఉస్మాన్ బాషా, కార్యదర్శిగా ఎం.అశోక్, కోశాధికారిగా గొర్రిపోటి హేమసురేష్, ఉపాధ్యక్షులుగా జి.భద్రరావు, చైతన్య బుల్లిస్వామిరెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా ఆదిరెడ్డి, త్రినాథ్‌రెడ్డిలు ఎంపికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి అన్నివిధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

108 సేవలపై అవగాహన

అనపర్తి: 108 సేవలపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని 108 రాజమహేంద్రవరం డివిజన్ ఓఈ ఆదిత్యరామ్‌చౌదరి అన్నారు. అత్యవసర సమయాల్లో 108 వాహనాన్ని ఏవిధంగా వినియోగించుకోవాలన్న అంశంపై మంగళవారం మండలంలోని కుతుకులూరు పీహెచ్‌సీలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిత్యరామ్ చౌదరి మాట్లాడుతూ ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు సంభవించిన సందర్భాలో 108 ఆపద్బాంధవిగా ఉపయోగపడుతోందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ చాందినీ కుమార్, డాక్టర్ దుర్గా ప్రసాద్, 108 సిబ్బంది ఎస్.శ్రీనివాస్, ఎ.అర్జున్, వెంకట్, డి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

వంటగ్యాస్ పెంపుపై నిరసన

రాజానగరం: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను నిరసిస్తూ అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో రాజానగరంలో మంగళవారం నిరసన తెలిపారు. స్థానిక అన్నదాన సత్రం కల్యాణ మండపం నుంచి బస్టాండ్ సెంటర్ వరకూ సాగింది. ఈ సందర్భంగా గాంధీ బొమ్మ సెంటరులో ఖాళీ గ్యాస్ బండ పై కూర్చుని, కట్టెల పొయ్యిపై వంట చేస్తూ నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్షుడు జనిపెల్ల సత్తిబాబు, కార్యదర్శి పి.వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న లక్ష్మీషా

రాజానగరం: జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీషా అన్నారు. వెలుగుబంద జగనన్న కాలనీలో జరుగుతున్న గృహ నిర్మాణాలను మంగళవారం ఆయన పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. అన్ని మౌలిక సదుపాయాలను దశల వారీగా కల్పిస్తామన్నారు. ఇంటి నిర్మాణం చేపట్టిన వారికి ఉచితంగా విద్యుత్ మీటర్లు సమకూర్చుతున్నామన్నారు. ఆయన వెంట రాజమహేంద్రవరం కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్‌కుమార్, జిల్లా అధికారి పరశురామ్ ఉన్నారు.

ఘనంగా హోలీ వేడుకలు

పెదపూడి: మండలంలోని జి.మామిడాడ, పెదపూడి, పెద్దాడ, సంపర, రామేశ్వరం, కరకుదురు, కాండ్రేగుల తదితర గ్రామాల్లో హోలీ వేడుకలను యువత, విద్యార్థులు మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు గ్రామాల్లోని వీధుల్లో యువత ఒకరిపై మరొకరు వివిధ రకాల రంగులు చల్లుకుని హోలీ సంబరాలు జరుపుకొన్నారు.

యువత పాత్ర కీలకం

రాజానగరం: దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని జిల్లా బాలల సంక్షేమ న్యాయమూర్తుల పీఠం చైర్‌పర్సన్ పేరిచర్ల సూర్యప్రభావతి సూచించారు. గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీలో నెహ్రూ యువకేంద్ర జిల్లా స్థాయిలో మంగళవారం నిర్వహించిన 'నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్' కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్ మాట్లాడుతూ యువత రాజకీయాలలోకి రావాలని, దేశ సంక్షేమానికి వెన్నెముకగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వాక్ పార్లమెంటులో అడిగిన ప్రశ్నలకు చాకచక్యతో సమాధానాలిచ్చిన 11 మందిని ఎంపిక చేశారు. జిల్లాలోని 17 కళాశాలల నుంచి 230 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా యూత్ ఆఫీసర్ పి.అమృతేష్, ఎన్ఎస్ఎస్ పీఓ షేక్ మీరా, డాక్టర్ మూర్తి, టీవీ సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

సీతానగరం: ముగ్గళ్లలో ఓబులినేని సీతారామ తంబయ్యకు చెందిన వర్జీనియా పొగాకు బ్యారన్ మంగళవారం దగ్ధమైంది. క్యూరింగ్ ఫైనల్ స్టేజ్‌లో పొగాకు కాలిపోయింది. వర్జీనియా పొగాకు విలువ రూ.2 లక్షలు, బ్యారన్ విలువ రూ.3 లక్షలు ఉంటుందని అంచనా. స్థానికుల సమాచారంతో రాజమహేంద్రవరం నుంచి వచ్చిన అగ్నిమాపక శకటం మంటలను అదుపు చేసింది.

బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం

గోకవరం: అరుదైన సీజీడీవ్యాధితో బాధపడుతున్న రెండున్నరేళ్ల బాలుడు సత్యశ్రీఅక్షయ్‌రామ్ వైద్యానికి ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు రూ.50 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ మొత్తాన్ని మంగళవారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పాలూరి బోసుబాబుకు ముప్పిడి కళ తదితరులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు బత్తుల నానాజీ, ముమ్మిడివరపు చినబాబు, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడి

గోకవరం: రైతులు పండ్ల తోటల్లో సస్యరక్షణ చేపట్టడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని వెంకటరామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ ఎం.మాధవి అన్నారు. రూరల్ హార్టీకల్చర్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ కార్యక్రమంలో భాగంగా విశ్వవిద్యాలయం విద్యార్థులతో వీరలంకపల్లిలో ప్రకృతి వ్యవసాయ చేస్తున్న రామకృష్ణా గార్డెన్స్‌లో మంగళవారం రైతు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో భాగంగా రైతులకు పలు సూచనలు చేశారు.